# హఠాత్పరిణామం

-మంకు శ్రీను



సుబ్బారావు సుస్ఫురద్రూపి. ఎవరినైనా ఇట్టే కట్టిపడేసే ఆకర్షణీయమైన వ్యక్తిత్వం. చిరునవ్వు అతని ముఖంలో ఎప్పుడూ తొణికిసలాడుతూ ఉంటుంది. సుబ్బారావంటే కొలీగ్స్‌కి చెప్పలేనంత ఆరాధనాభావం. ఆ వెనుకే కించిత్తు అసూయ. సమయానికి సరిపడా బదులిస్తూ మాటల పొదుపు పాటిస్తాడు. అవసరమనిపిస్తే అందరినీ నవ్వించడం కూడా అతనికి చేతనైన విద్య.

ఇలా ఆఫీసంతా సుబ్బారావు తన సర్వంసహాధిపత్యం చెలాయిస్తున్నాడు. సుబ్బారావు పనితీరు పట్ల సంతృప్తిని ప్రకటించిన యాజమాన్యం ఒక ఇంక్రిమెంట్ అదనంగా ఇచ్చి సంతోషపరిచింది.

ఇలా ఉండగా ఒకరోజున హఠాత్పరిణామం జరిగింది.

ఒక అందాల రాశి దివి నుండి భువికి ఏతెంచినట్లుగా ఆఫీసులో ప్రత్యక్షమైంది. ఆమె పేరు సౌజన్య. ఆమె నిజంగానే సౌజన్యంగా ఉంది. స్టెనోగ్రాఫర్‌గా కొత్తగా ఉద్యోగంలో చేరింది. ఆ ఆఫీసు మొత్తానికి ఆమే ఏకైక లేడీ ఉద్యోగి. ఇక అక్కడ పని చేస్తున్న వారంతా సుబ్బారావుతోసహా అవివాహితులే. ఇక చెప్పేదేముంది అందరి కళ్లూ ఆమె మీదే.

సౌజన్య మల్లెమొగ్గలాంటి చిరునవ్వులు చిందిస్తూ ఆఫీసు స్టాఫ్‌ను పరిచయం చేసుకుంది. అందరి శరీరాల్లో అసంకల్పిత చైతన్యం విద్యుత్ప్రవాహంలా వెల్లివిరిసింది. ఇక రోజూ పండుగే. ఆమె రాక ఏరువాక అయ్యింది. ఆమె చూపులు మన్మథుడు సంధించిన విరితూపుల్లా అందరి హృదయాలను గాయపర్చడం మొదలుపెట్టాయి. ఆమెను తనదాన్నిగా చేసుకోవాలని, ఆమె కరుణా కటాక్ష వీక్షణాలనే వెన్నెలలకోసం ఎదురుచూసే చకోర పక్షుల్లా ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు నిమగ్నులయ్యారు.

***

రోజులు గడుస్తున్నాయి. స్టాఫ్‌కు ఒకటే విరహజ్వరం. దగ్గరుండి దూరంగా ఉండడం ఎంత బాధాకరం? సుబ్బారావు మాత్రం తక్కువ తిన్నాడా? ఆమె ప్రేమ సాక్షాత్కారాన్ని అర్థిస్తూ శక్తి వంచన లేకుండా తన ప్రయత్నం తాను చేస్తున్నాడు.

పాపం సుబ్బారావు విసిరిన చూపుల తూపులకు సౌజన్య ఓడిపోయింది. క్రమంగా వారి పరిచయం పెరిగి చివరకు ప్రణయంగా పరిణమించింది. ఈ హఠాత్పరిణామానికి స్టాఫ్ అంతా అవాక్కయిపోయారు. చేసేది ఏముంది వారిని దీవించడం తప్ప.

మొదటిసారిగా జీవితంలో హృదయానికి తగిలిన ఎదురుదెబ్బను తమాయించుకుని చెక్కుచెదరని ఆరాధనాభావంతో సుబ్బారావుకు అభినందనలు తెలిపారు.

'పోనీలే... ఆ దేవకాంత నిన్నయినా వరించి మన ఆఫీసు పరువు నిలబెట్టిందని' ముక్తకంఠంతో సుబ్బారావును మనసారా అభినందించి ఆశీర్వదించారు.

సుబ్బారావు, సౌజన్య ప్రేమాయణాన్ని పురస్కరించుకుని ఒకరోజున కొలీగ్స్‌ని డిన్నర్‌కు పిలిచాడు. కొలీగ్సంతా పుష్పగుచ్ఛాలతో డిన్నర్‌కు హాజరయ్యారు. ఒక ఆదర్శ ప్రేమజంటకు త్వరలో పెళ్లి చేస్తున్నామన్న ఆనందం వాళ్లల్లో కొత్త భావాలకు తెరలేపింది.

సౌజన్య కొలీగ్స్‌ని ఆత్మీయంగా, ఆప్యాయంగా పలకరించింది. డిన్నర్‌కు విచ్చేసినందుకు సుబ్బారావు హర్షం ప్రకటించాడు. భోజనాలు చాలా బ్రహ్మాండంగా ఏర్పాటు చేసాడు. వారంతా సంతుష్టాంతరంగులై కాబోయే సుబ్బారావు దంపతులను దీవించబోయారు.

మళ్లీ ఆ సమయంలో అందరినీ నివ్వెరపరిచే హఠాత్పరిణామం చోటు చేసుకుంది.

“మిత్రులారా! మీరు చాలా మంచివారు. మీ సాంగత్యం లభించడం నా అదృష్టం. నిష్కల్మషమైన మీ మనసులు నన్ను ముగ్ధుడ్ని చేసాయి. ఈ శుభ సందర్భంలో మీకో ఆశ్చర్యకరమైన విషయం చెప్పబోతున్నాను. మీరనుకుంటున్నట్లుగా ఈ సౌజన్య నా ప్రేమికురాలుకాదు. నా సతీమణి. మన ఆఫీసులో స్టెనోగ్రాఫర్ పోస్టు ఖాళీగా ఉంటే నేనే అప్లై చేయమన్నాను. గాడ్ ఈజ్ గ్రేట్. నేను పని చేసే ఆఫీసులోనే ఆమెకూ ఉద్యోగం వచ్చింది. సరదాకి నేనే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచాను. మిమ్మల్ని, మీ మనసుల్ని మా సౌజన్య కొంత కాలం కలవరపెట్టినందుకు పెద్ద మనసుతో మన్నించాలి. సాటి స్త్రీపట్ల సోదరిభావాన్ని ప్రదర్శించడం మన సంప్రదాయం అన్న సంస్కృతిని నిలబెట్టినందుకు మీకు నా కృతజ్ఞతలు” అంటూ సుబ్బారావు తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాడు. సౌజన్య సిగ్గుతో తల వంచుకుంది.

★